ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవారే గురువులు



పోపూరి శ్రీనివాస శర్మతో కలిసి కీర్తనలు గానం చేస్తున్న సంగీత విద్యార్థులు

నల్లకుంట: ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవారు గురువులని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ చెప్పారు. శుక్రవారం సాయంత్రం నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలో గల శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. దీనికి హాజరైన పోపూరి శ్రీనివాస శర్మ అక్కడ ఏర్పాటు చేసిన వ్యాసమహర్షి, సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకరశర్మ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం సంగీత వద్యాలయం విద్యార్థులచే నిర్వహించిన సంగీత కచేరి ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్వాంసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత శిక్షకురాలు తేజస్విని, యశస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్య సమస్యను పరిష్కరించండి



నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న బజరంగ్ సేన ప్రతినిధులు

కాచిగూడ: నగరం అంతటా మసీదులపై ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్ల వల్ల కలిగే శబ్ద కాలుష్య సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లక్ష్మణ్ రావు నేతృత్వంలో కాచిగూడ లోని బజరంగ్ సేన కార్యాలయం నుంచి ప్రతినిధి బృందం శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజల శాంతి, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెల్లవారుజామున, రాత్రి సమయంలో శబ్ద కాలుష్య మార్గదర్శకాలను, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్ సేన ప్రతినిధులు రాఘవ మణి, మనోజ్ మొగలగిద్ది, కీర్తి అవస్థి, వీరేందర్ అవస్థి తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు చేయాలి



జోనల్‌కమిషనర్ రవికిరణ్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: బోనాల పండుగ నేపథ్యంలో డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ పావని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలసి డివిజన్లోని సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరామన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా మట్టికుప్పలు తొలగించాలన్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు

కాచిగూడ: ఓ వ్యక్తికి పదునైన బ్లేడును చూపించి అతని వద్ద నుంచి నగదును దోచుకుని, మెడపై గాయపరిచిన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.శ్రీదేవి తీర్పునిచ్చిందని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. 23 డిసెంబర్ 2017లో యాకుత్‌పుర -డబీల్‌పుర రైల్వే ట్రాక్ వద్ద చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ నోమన్ ఆఫ్రిది (27) ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నోమన్ ఆఫ్రిదికి 2 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారని రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిర్వహణ అస్తవ్యస్తం.!

• వెలవెలబోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు • టీచర్లు, ఆయాల కొరతతో ఇబ్బందులు



మూతపడ్డ అచ్చయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం



పాలమూరి బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో వీధి కుక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు, ఆయాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలన్నీ మూగబోతున్నాయి. కొన్ని చోట్ల కేంద్రాలన్ని పిల్లలు లేకపోవడంతో వెలవెల బోతున్నాయి .ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ఒక ఇంతగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాంనగర్‌డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్యనగర్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, శ్రీరాంనగర్, పాలమూరి బస్తీ, లంబాడీబస్తీ, సూర్యనగర్, తదితర ప్రాంతాలలో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

వీధి కుక్కలకు స్థావరంగా..

◆ ఇందులో ముఖ్యంగా పాలమూరి బస్తీలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసిన సంగీతకు సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ రావడంతో బదిలీపై వెళ్లిపోయారు. ఈ సెంటర్‌లో పనిచేస్తున్న ఆయా నాలుగేళ్ల క్రితం మృతి చెందడంతో ఆ సెంటర్ పూర్తిగా పిల్లలు లేక వెలవెలబోతుంది. ఇది వీధి కుక్కలు పడుకోవడానికి స్థావరం మారింది. దీనికి ఇన్‌చార్జీగా సంజయ్‌నగర్ బస్తీ అంగన్‌వాడీ టీచర్ ఉమామహేశ్వరి ఉన్నారు.

ఇక్కడైతే టీచర్, ఆయా లేరు...

◆ శ్రీరాంనగర్ బస్తీలో అంగన్‌వాడీ టీచర్, ఆయా లేకపోవడంతో ఆ సెంటర్ కూడా అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఇలా చెప్పుకుంటూపోతే ఎంత గొప్ప లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత తీవ్రస్థాయిలో ఉండడంతో ఆ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లు అవుతోంది. కొన్ని చోట్ల టీచర్లే అన్ని తానై చూడాల్సి రావడంతో వారిపై పని భారం ఎక్కువవుతోంది.

అన్ని తానై నడిపిస్తోన్న ఆయా..

ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో గతంలో పనిచేసిన టీచర్ వృద్ధాప్యంతో విధులను మానివేసింది. అందులో పనిచేస్తున్న ఆయానే అన్ని తానై నడిపిస్తోంది. ఇక అచ్చయ్య నగర్ ఉన్న అంగన్‌వాడీ సెంటర్ పూర్తిగా మూసి వేయబడింది. ఇందులో పనిచేసిన టీచర్ వసంత కరోనా కాలంలో మృతి చెందడంతో ఆ సెంటర్‌ను చూసే వారే లేకుండా పోయారు.



ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ అంగన్‌వాడీ కేంద్రంలో తక్కువగా ఉన్న చిన్నారులు

సంజయ్ నగర్ బస్తీలో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్



పూర్వ వైభవం తీసుకురావాలి...

సంజయ్‌నగర్ బస్తీలో టీచర్, ఆయాలు ఇద్దరు ఉన్నప్పటికీ 12మంది చిన్నారులే ఉన్నారు. ఇలా కేంద్రాలన్నీ రానురాను మూతపడే స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ వైభవం వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వచ్చే గుడ్లు, పాలు, బాలామృతం తదితర సరుకులన్ని సక్రమంగా అందకపోవడంతో పాటు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



ముషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంతోష్‌కుమార్ తదితరులు

కవాడిగూడ: ప్రభుత్వ స్కూల విద్యార్థులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం రవాణా శాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ధర్మసమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జీ గుడపర్తి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మసమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ముషీరాబాద్ నియోజకవర్గం నేతలు లోయర్ ట్యాంక్ బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు యాజామాన్యాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా బస్సులను ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం, రవాణ శాఖ మంత్రి ఉచిత బస్సులు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు డి. కిరణ్,శివగౌడ్, శ్రీధర్, రాజుతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రత్నమాలకు జిల్లా వైద్యశాఖ బెస్ట్ ఎంప్లాయి అవార్డు



ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నమాలకు జిల్లా స్థాయిలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు లభించింది. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రత్నమాలకు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి సర్టిఫికెట్టు, మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ కరోన కాలం నుంచి విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు జిల్లా స్థాయిలో రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తుకారం, జయమాలిని, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ శివకుమార్

బంగారు ఆభరణాల పర్సును పోలీసులకు అప్పగించిన శివకుమార్

చిక్కడపల్లి: బాగ్‌లింపల్లి శ్రీరామ్‌నగర్‌లో ఓ వ్యక్తి బంగారు ఆభరణాలతో ఉన్న పర్సును శుక్రవారం చిక్కడపల్లి పోలీసులకు అందించి తన నిజాయితీని చాటుకున్నారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఈ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ బీహెచ్‌ఈఎల్ పటాన్‌చెరులో నివాసముంటున్న ఎస్.నందినీ కుమారి బాగ్‌లింగంపల్లి శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న తన చెల్లెలు నిర్వహిస్తున్న పూజలో పాల్గొనేందుకు భర్త ఎ.భరత్‌రాజ్‌తో కలసి వచ్చింది. అదే సమయంలో తనకారులో నుంచి దిగుతుండగా చేతిలో 8 తులాల బంగారు ఆభరణాలతో ఉన్న పర్సు కనిపించలేదు. వెంటనే విషయాన్ని చిక్కడపల్లి పోలీసులుకు సమాచారం అందించారు. రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన పి.శివకుమార్‌కు ఈ పర్సు లభించడంతో దానిని చిక్కడపల్లి పోలీసులుకు అప్పగించారు. పర్సు లభించిన సమాచారాన్ని బాధితురాలికి చెప్పారు. బంగారు ఆభరణాలతో ఉన్న పర్సును ఇచ్చి తన నిజాయితీ చాటుకున్న శివకుమార్‌ను చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి





ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు సభలో ప్రొఫెసర్ లింబాద్రి, విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని అప్పుడే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని అంబేడ్కర్ విద్యా సంస్థల సీఈఓ, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ విద్యార్థులకు విడ్కోల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ... ఏ రంగాన్ని ఎంచుకున్న అందులో నైపుణ్యం సాధించిన వారికే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అంబేడ్కర్ విద్యా సంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే జి. వినోద్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తమ సంస్థ ద్వారా ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడ చదివిన ఎంబీఏ విద్యార్థులకు అన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఆంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానించిన బీజేపీ నాయకులు

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాంచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ బీజేపీని ప్రజలకు మరింత దగ్గర చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను, గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన మోసాలను ఎండగడుతూ పార్టీని మరింత బలమైన శక్తిగా మార్చాలన్నారు. రాంచందర్‌రావును కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్, దిశా కమిటీ సభ్యులు నందగిరి నర్సింహ్మా, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, రాంచందర్‌రావుకు శాలువాలు కప్పి సన్మానించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ప్రకటనపై హర్షం



ఇందిరాపార్కు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కవాడిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తామని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రేవంత్‌రెడ్డి సర్కార్ మాట నిలబెటుకొందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చి తీరుతుందని విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అవకాశం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటన చేయడాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇందిరాపార్కు చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, మారిశెట్టి నర్సింహారావు, అతినగరం సుదేష్, సంగపాక వెంకట్, వెంకటేష్‌గౌడ్ విజయ యాదవ్, జగదీష్, సాయిబాబా, నరేందర్, బాబురావు, తిరుమల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



మహనీయుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న టీజేఎస్ నేతలు

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ జనసమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో అరుంధతినగర్ బస్తీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసయ్య మహనీయులైన జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం 32శాతం ఉన్న రిజర్వేషన్లను 18 శాతానికి తగ్గిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం చేసిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయమని , ఈ నిర్ణయంతో తెలంగాణలో సామాజిక విప్లవం రావడానికి నాంది పలికిందని అభిప్రాయపడ్డారు. బీసీలు మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడతాయని అన్నారు.అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజవరం టీజేఎస్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జైపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు వెంకటయ్య, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, నేతలు సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్, బస్తీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ బోనాలు



ముషీరాబాద్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో ఆసుపత్రి నుంచి బోనాలను తీసుకువచ్చి ముషీరాబాద్ మహంకాళీ దేవాలయంలో అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పెల్లీస్, వైద్య సిబ్బంది సంతోషి, అనురాధ, రజిని, విజయకుమారి, యాదగిరి రాజు, మాధవి, అనూష, రేణుక, అనిత, కవిత, ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గీతా కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేకపోతుల వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లుగీత వృత్తిలో ప్రమాదానికి గురైన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్వయంగా ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ఏడాది గడిచిన ఇంతవరకు అతీగతి లేదన్నారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదానికి గురైన 710 మందికి 12 కోట్ల 96 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాకి సంబంధించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షులు వి. వెంకటనరసయ్య , రాఘవేంద్ర, పొన్నం రాజయ్య, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంట అంబర్‌పేటకు మణిహారం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- అధికారులతో కలిసి కుంట పునరుద్ధరణ పనుల పరిశీలన



పర్వరీష్‌బాగ్ కాలనీలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,కార్పొరేటర్ ఉమారాణి

అంబర్‌పేట: బతుకమ్మకుంట పునరుద్ధరణ అంబర్‌పేట నియోజకవర్గానికి మణిహారమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గం నడిబొడ్డులో బతుకమ్మకుంట పునరుద్ధరణ ఆహ్లాదకర వాతావారణం ఎంతో దోహదపడుతుందని అన్నారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుందరమైన కుంట పునరుద్ధరణ భవిష్యత్తులో ఇబ్బందులు తెలెత్తకుండా ముందు జాగ్రత్తగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ప్రధానంగా కుంటలోకి వచ్చే వర్షపునీరు, నీరు బయటకు వెళ్లేందుకు చేపట్టే పనులను పకడ్బందీగా చేయాలన్నారు.

◆ బతుకమ్మకుంట పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. చుట్టు ట్రాక్ నిర్మాణం, పచ్చదనం నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఇప్పటి వరు పునరుద్ధరణ పనులు 80 శాతం పూర్తి కావడం అభినందనీయమన్నారు. కుంట పునరుద్ధరణ నిర్మాణ పనుల్లో ఏలాంటి తప్పిదాలు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిగిలి 20 శాతం సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. స్థానికంగా ఏలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటాన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బీ.వెంకట్‌రెడ్డి, బాలరాజు, డీఈ మోహన్ ఇతర అధికారులు, స్థానికులు ఉన్నారు.

కోట్లాది రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి



బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వెల్లడించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పర్వరీష్‌బాగ్ కాలనీలో రూ.29లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ ద్వారా ఇప్పటికే రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరిన్ని అభివృద్ధి పనుల కోసం మరో రూ.10 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు కూడా మంజూరై టెండర్ ప్రాసెస్‌లో ఉన్నాయని వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో రూ.3కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.3కోట్ల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

ప్రణాళికాబద్ధంగా ప్రగతి...

ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికబద్ధంగా ప్రగతి సాధిస్తున్నామని, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతిని మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత ప్రతిపాదికన పరిష్కారాలు చూపిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, సిబ్బందికి సూచిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రశాంత్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూసింగ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బల్వీర్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, హజారి బాబు, తదితరులు పాల్గొన్నారు.